

డెలివరీ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

డెలివరీ బాయ్స్‌కు సేఫ్ డ్రైవ్‌పై అవగాహన కల్పించాలి : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్, ఫుడ్, గూడ్స్ సరఫరా చేస్తున్న డెలివరీ బాయ్స్ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు ఆయా సంస్థల ప్రతినిధులు రోడ్ సేఫ్టీపై దృష్టి పెట్టాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. కమిషనరేట్‌లో డెలివరీ సంస్థల ప్రతినిధులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డెలివరీ బాయ్స్‌కు సరైన డ్రైవింగ్ నైపుణ్యం లేకపోవడం, నిద్రలేమి, త్వరగా చేరుకోవాలనే ఆత్రుత, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా ఎక్కువగా ప్రమాదాల బారిన పడడంతోపాటు ఇతరులను కూడా ప్రమాదాల బారిన పడేస్తున్నారన్నారు. ఈ తరుణంలో పోలీసులు విధించిన చలాన్ల కారణంగా ఆదాయం కోల్పోతున్నారని తెలిపారు. చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్న యువతకు తగిన డ్రైవింగ్ నైపుణ్యాలతోపాటు రోడ్ సేఫ్టీపై శిక్షణ కోసం కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ క్రైం అరవింద్‌బాబు, డీసీపీలు ట్రాఫిక్ మనోహర్, శ్రీనివాసులు, బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్ అమెజాన్, డీటీడీసీల ప్రతినిధులు పాల్గొన్నారు.



తిరంగ జెండా ర్యాలీ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఎల్బీనగర్ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం కాంప్లెక్స్ వరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగ-తిరంగ యాత్ర కార్యక్రమానికి సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గిరిజన దినోత్సవం



గిరిజన దినోత్సవంలో గిరిజన నాయకులు

వనస్థలిపురం : ఆదివాసి గిరిజన దినోత్సవాలు శుక్రవారం ఎన్టీఆర్‌నగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గోపీనాయక్, జగన్‌నాయక్‌లు మాట్లాడుతూ గిరిజన హక్కులను సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. గిరిజనుల హక్కుల సాధనకు ప్రపంచంలోని 90 దేశాలు ఐక్యరాజ్య సమితిలో చేసిన తీర్మానంపై సంతకాలు చేసినా కూడా తమకు దక్కాల్సిన హక్కుల అమలు కోసం నేటికి పోరాటం చేయాల్సి వస్తుందని వాపోయారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మగంతనాయక్, ముత్యాలు, నవీన్, సైదిబాయి, శ్రీను, లక్ష్మీబాయి, మిలాల్, సిద్ధునాయక్ పాల్గొన్నారు.

క్విట్‌ఇండియా స్ఫూర్తితో హక్కులను సాధించుకుందాం

వనస్థలిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్విట్ ఇండియా స్ఫూర్తితో హక్కులను సాధించుకుందామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకుందాం.. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం అనే నినాదంతో శుక్రవారం ఎల్బీనగర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో హక్కుల సాధనకు కార్మికులు కృషిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎల్బీనగర్ కన్వీనర్ ఎల్లయ్య, కడారి రాములు, లక్ష్మణ్, రామ్మూర్తి, వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

11న అమ్మవారి ఘటం ఊరేగింపు

కొత్తపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ బీజేపీ కార్యాలయం నుండి అమ్మవారి ఘటం ఊరేగింపు ఈనెల 11న మధ్యాహ్నం ప్రారంభమవుతుందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోల్గం యశ్పాల్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన అమ్మవారి ఘటం ఊరేగింపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాలాజీనగర్ బంగారు మైసమ్మ ఆలయం, కొత్తపేట విలేజీ బుజ్జి మైసమ్మ ఆలయం తదితర 11 అమ్మవారి గుడుల మీదుగా ఊరేగింపు కొనసాగుతుందన్నారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో, ఊరేగింపులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిరణ్‌కుమార్, వినోద్, రాజు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

31 వరకు బధిరుల పాఠశాల అడ్మిషన్లు

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న బధిరుల ఆశ్రమపాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. ఆగస్టు 31 వరకు అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు. చెవిటి,మూగ విద్యార్థులకు 1నుంచి 10వ తరగతి వరకు హాస్టల్ సౌకర్యంతో విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా ఇవ్వబడుతాయని, అడ్మిషన్ల కోసం బధిరుల పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

తుర్కయంజాల్ కాలనీల్లో డ్రైడే, ఫ్రైడే

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరయ్యారు. వనమహోత్సవంలో భాగంగా రాగన్నగూడలో శ్రీరాంనగర్‌కాలనీ, జనచైతన్యనగర్ కాలనీ, సాయిబృందావన్, వాసవీనగర్, విటేజ్‌హోం, సాగర్ రెసిడెన్సీ, సరిగమసిటీ, పగోడ ప్లాజాలలో పర్యటించి ప్రజల సమస్యలను రాంరెడ్డి అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరిత ధన్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు మంగమ్మ, మాధవి మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, హరిత, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మూసీలో ఆయిల్ బాల్స్ చల్లిన కార్పొరేటర్

చాదర్‌ఘాట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దోమలను నివారించేందుకు మూసీలో, మూసీ పరీవాహక ప్రాంతంలోని లార్వాను పూర్తిగా అంత మొందించేందుకు ఆయిల్ బాల్స్‌ను చల్లించే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. శుక్రవారం మూసారాంబాగ్‌లోని మూసీ పరీవాహక ప్రాంతంలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ గున్నప్పతో కలిసి లార్వాను పూర్తిస్థాయిలో నివారించేందుకు ఆయిల్ బాల్స్‌ను ఆమె చల్లారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మురళీ, జీహెచ్ఎంసీ శానిటేషన్ జవాన్ రమేష్, యూబీడీ మేనేజర్ యమున, సూపర్‌వైజర్ కృష్ణ, రీసోర్స్ పర్సన్ అండాలు, ఎస్ఎఫ్ఏలు గణేశ్, ముజీబ్, శ్రీనివాస్, సుభాష్, అక్షయ్ పాల్గొన్నారు.

గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకానికి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామోద్యోగ్ వికాస్ యోజన (జీవీవై) పథకం కింద శిక్షణ, సాధనాల కోసం అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను జీవీవై స్కీమ్ కింద అగర్‌బత్తి తయారీ, పేపర్‌ప్లేట్ల తయారీ, పేపర్ మార్పిడి, మనీ ఆయిల్ తయారీ, టర్నవుడ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, మొబైల్ రిపేరింగ్, కుట్టు యంత్రాలు, లెదర్/పాదరక్షలు, చేతివృత్తుల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తునట్లు తెలిపారు. ఆగస్టు 20-2024 వరకు http://www.kvic.gov.in// ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులపంచమి వేడుకలు

సంతోష్‌నగర్ , ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్, సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేట పరిసరాలలో శుక్రవారం నాగులపంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో, కాలనీల్లో పాము పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలుపోసి నైవేద్యం సమర్పించారు. ఉపవాస దీక్షలు ఆచరించిన మహిళలు పాము పుట్ట వద్ద మొక్కులను చెల్లించుకున్నారు. ముఖ్యంగా శంకేశ్వర్‌బజార్‌లోని శంకేశ్వరాలయం, సైదాబాద్‌కాలనీ రామాలయం, లక్ష్మీనగర్‌కాలనీ పార్కుకు మహిళలు భారీగా తరలివచ్చి పూజలు నిర్వహించారు.



వనస్థలిపురంలో పుట్టకు పాలుపోస్తున్న భక్తులు

ఓల్డ్‌మలక్‌పేట : ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ ఆలయంలో శుక్రవారం నాగులపంచమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచే దేవాలయం చేరుకొని పూజల కోసం క్యూకట్టారు. మహిళలు, భక్తులు దేవాలయంలో ఉన్న పుట్టకు పాలు, గుడ్లు పెట్టి అమ్మవారికి ప్రత్యేకంగా వండిన ప్రసాదాలను సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు. నాగులపంచమిని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు పీటీ శంకర్‌ముదిరాజ్, తులసి సురేష్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ముప్పిడి లలితశ్రీనివాసులు, చౌకి రవికుమార్, టిన్ను సంగ్, నరేందర్, ముప్పిడి వెంకటేశ్, బాబాగౌడ్, కృష్ణారెడ్డి, ఆలయ పూజారి శ్రీనివాసచారి పాల్గొన్నారు.



వనస్థలిపురంలోని గణేష్ టెంపుల్‌లో పుట్టకు పాలుపోస్తున్న భక్తులు

డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు

● టీకేఆర్ కాలేజీలో అవగాహన సమావేశంలో వక్తలు

సరూర్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, డ్రగ్స్‌కు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని పలువురు వక్తలు సూచించారు. శుక్రవారం మీర్‌పేట్‌లోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సంయుక్త ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ శ్రీనివాస్ హాజరై యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకుంటున్న వారిలో విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నట్లు తమ విభాగం నిర్వహిస్తున్న దాడుల ద్వారా స్పష్టమవుతున్నదని, డ్రగ్స్‌బారిన పడితే భవిష్యత్తు అంధకారమయమవుతుందని అన్నారు. ఈ దృష్ట్యా విద్యార్థులు తమ తల్లిదండ్రులను, ఇతర కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు, టీకేఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి సునీత, ప్రిన్సిపాళ్లు రవిశంకర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తీగల, సుబ్బరామిరెడ్డి, శ్రీనివాస్

థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధికారిని విధుల నుంచి తొలగించాలి

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, ఇబ్రహీం శేఖర్

వనస్థలిపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దళిత మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధికారిని విధుల నుంచి పూర్తిగా తొలగించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంద ప్రభాకర్, ఇబ్రహీం శేఖర్ డిమాండ్ చేశారు. దళిత మహిళ సునీతపై జరిగిన దాడికి నిరసనగా బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం శేఖర్‌లు మాట్లాడుతూ షాద్‌నగర్‌లో దళిత మహిళ సునీతపై అవమానవీయంగా వివస్త్రను చేసి భర్త, కొడుకు ఎదుటే థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డీఐ రామిరెడ్డిని తక్షణమే విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సరైన న్యాయం చేయకపోతే డీజీపీ కార్యాలయం, దళిత ఎమ్మెల్యేల ఆఫీస్‌ల ముట్టడి కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుండెల ధర్మేందర్, న్యాయవాది నిషాని రామచంద్రం, నాయకులు గ్యార జగన్, దయాకరన్ మౌర్య, రాములు, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం శేఖర్

నేడు రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి బండి సంజయ్ రాక

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి రానున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం స్థానికంగా వివిధ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరవుతారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పార్టీవర్గాలు తెలిపాయి.

నల్లబ్యాడ్జీలు ధరించి న్యాయవాదుల నిరసన

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జనగాంలో న్యాయవాద దంపతులపై దాడిని నిరసిస్తూ శుక్రవారం హయత్‌నగర్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ న్యాయవాదులు దాడికి పాల్పడిన సీఐ, ఎస్‌లను, ఇతర పోలీస్ సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు ప్రభాకర్‌గౌడ్, నరేష్, సతీష్, ఈశ్వర్‌గౌడ్, సరిత, శివకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

మ్యాట్రిమోనీ సైట్‌లో అమ్మాయిల నకిలీ వివరాలతో మోసం

● ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థులు అరెస్టు

కొత్తపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోనీ సైట్‌లో అమ్మాయిల ఫొటోలు, నకిలీ వివరాలుపెట్టి పలువురిని మోసం చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థులను రాచకొండ సైబర్ సెల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ కాకినాడ, సూర్యారావుపేట, లైట్‌హౌస్‌కాలనీకి చెందిన షేర్‌మార్కెట్ ట్రేడర్ కోమలి సూర్యప్రకాష్(33) భద్రాద్రి కొత్తగూడెం, పాల్వంచ గుత్తిగూడెంలో ఉంటున్నాడు. సూర్యారావుపేట శ్రీనివాసనగర్‌కు చెందిన సెట్టి సతీష్ (33) లారీలు, టిప్పర్ల ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్నాడు. సతీష్ మేనబావ సూర్యప్రకాష్.

మోసపోయిన అనుభవంతో.. విలాసాలకు బానిసలై

కోమలి సూర్యప్రకాష్ గతంలో మ్యాట్రిమోనీ సైట్‌లో నకిలీ వివరాలకు ఆకర్షితుడై మోసపోయాడు. ఆ అనుభవంతో తనే మ్యాట్రిమోనీ సైట్‌లో గుర్తు తెలియని అమ్మాయిల ఫొటోలు, నకిలీ వివరాలతో అమాయకులను మోసం చేసి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. అతడు, మేనబావ సతీష్ పథకం ప్రకారం మ్యాట్రిమోనీ సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు.

వాయిస్ మార్చి అమ్మాయిలాగా మాట్లాడే ఫీచర్లతో..

ఓ ప్రత్యేక సెల్‌ఫోన్‌లో గల వాయిస్ మార్చి అమ్మాయిలాగా మాట్లాడే ఫీచర్లను ఉపయోగించారు. పలు మ్యాట్రిమోనియల్ సైట్స్‌లలో ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న అందమైన అమ్మాయిల ఫొటోలు పోస్టు చేసి నకిలీ పేర్లతో వారిద్దరూ రిజిస్టర్ చేసుకున్నారు. ప్రపోజల్స్ పంపిన యువకులతో వాయిస్ మార్చి అమ్మాయిలా మాట్లాడుతూ ఆర్షించేవారు. తర్వాత అందమైన అమ్మాయిల ప్రొఫైల్ ఫొటోలు చూసిన యువకులు ఫోన్‌లో మాట్లాడేందుకు వెనుకాడేవారు కాదు, అలా అమ్మాయిల్లా ఫోన్ సంభాషణలు కొనసాగిస్తూ కుటుంబ సభ్యుల వివరాలు ఫొటోలు వాట్సప్‌లో షేర్ చేసుకొని బుట్టలో వేసుకునేవారు. ఆ తర్వాత తల్లిదండ్రులకు అనారోగ్యమనీ, చదువులకు ఫీజు కట్టాలనీ డబ్బులు పంపాలనీ ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడేవారు. ఇలా అమాయకుల నుండి లక్షల్లో డబ్బు దోచుకున్నారు. ఈ యేడాది రాచకొండ పరిధిలో వారి మాయ అమ్మాయిల మాటలకు మోసపోయి లక్షల్లో డబ్బు కోల్పోయిన బాధితుల ఫిర్యాదుల మేరకు సైబర్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులపై రాచకొండ పరిధిలో రెండు, రామగుండం ఎన్‌టీపీసీ పీఎస్, మహబూబ్‌నగర్ జడ్చెర్ల పీఎస్, సైబరాబాద్ పరిధిలో ఒక్కో కేసు నమోదయ్యాయి. వారి మాయలో పడి బాధితులు రూ. 33,68,216లు కోల్పోయినట్లు విచారణలో తేలింది.

పీడీయాక్ట్ పెట్టినా తీరు మార్చుకోని పాత స్నాచర్

● అరెస్ట్ చేసిన సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చెయిన్ స్నాచింగ్‌లు చేస్తూ పట్టుబడినా పీడీయాక్ట్ నమోదైనా అతడు తీరు మార్చుకోలేదు. మరో యువకుడితో కలిసి తిరిగి చెయిన్, మొబైల్ స్నాచింగ్‌లు చేసి పట్టుబడ్డాడు. పలు స్నాచింగ్‌లకు పాల్పడ్డ ఇద్దరిని సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మలక్‌పేట పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. మాదన్నపేట కుర్మగూడకు చెందిన మహ్మద్ మహమూద్ షరీఫ్ అలియాస్ మహ్మద్ అలియాస్ చోటు(29) బైక్ మెకానిక్. ఇతడు 2014లో సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 చెయిన్ స్నాచింగ్‌లు చేశాడు. సైదాబాద్ పోలీసులు ఇతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. వరుస స్నాచింగ్‌లకు పాల్పడిన మహమూద్ షరీఫ్‌పై 2015లో పీడీయాక్ట్‌ను సైతం ప్రయోగించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత బైక్ మెకానిక్‌గా పనిచేసుకుంటున్నాడు. వస్తున్న ఆదాయం సరిపోకపోవడంతో తిరిగి స్నాచింగ్ దారి పట్టాడు. దీని కోసం ఇతడి స్నేహితుడు సంతోష్‌నగర్, రియాసత్‌నగర్‌కు చెందిన క్యాబ్ డ్రైవర్ అబ్దుల్ గఫార్, అలియాస్ ఆరిఫ్, అలియాస్ ఆరిఫ్ చవుష్(37) సహకారం తీసుకున్నాడు. ఇద్దరు కలిసి జూలై మొదటి వారంలో వనస్థలిపురంలో మహిళ మెడలోని గొలుసు స్నాచింగ్ చేశారు. తర్వాత దిల్‌సుఖ్‌నగర్‌లో మొబైల్ స్నాచింగ్ చేశారు. టౌలిచౌకిలో టీవీఎస్ రైడర్ బైక్ చోరీ చేశారు. చోరీ చేసిన బైక్‌పై వెళ్తూ చైతన్యపురిలో మొబైల్ మూసారాంబాగ్‌లో చెయిన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. అంతేకాకుండా మహమూద్ షరీఫ్ తన బంధువుల కారు తీసుకొని బైరామల్‌గూడ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లోకి వెళ్లాడు. ఫుల్ ట్యాంక్ చేయించుకొని డబ్బులు చెల్లించకుండా పరారయ్యాడు. ఈ ఘటనలో కూడా ఇతడిపై కేసు నమోదైంది. పలు స్నాచింగ్ కేసులు నమోదు కావడంతో రంగంలోకి దిగిన సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మలక్‌పేట పోలీసులతో కలిసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 51.50 గ్రాముల బంగారం, ఐ20 కారు, టీవీఎస్ రైడర్ బైక్, పల్సర్ బైకు, రెండు మొబైల్ ఫోనులు స్వాధీనం చేసుకున్నారు.

ఉరేసుకుని తాపీ మేస్త్రీ ఆత్మహత్య

హయత్‌నగర్ : మద్యానికి బానిసై తాగిన మైకంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోరుపల్లి శ్రీను(30) తాపీ మేస్త్రీ కుటుంబ సభ్యులతో కలిసి పెద్దఅంబర్‌పేట్‌లో నివాసం ఉంటున్నాడు. తాగుడుకు బానిసైన శ్రీను శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీ పని ముగించుకుని ఇంటికి వచ్చిన భార్య నాగమణి చూసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే స్థానికులు ఉరినుంచి కిందకు దింపారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పందుల దొంగకు రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్ద షెడ్డులో నుంచి పందులను దొంగిలించిన తేరాసింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 10 పందులతో పాటు దొంగతనానికి ఉపయోగించిన స్విఫ్ట్ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తేరాసింగ్‌కు ఈశ్వర్, గణేష్ అనే స్నేహితులు సహకరించినట్లు పోలీసుల విచారణలో తేరాసింగ్ అంగీకరించినట్లు తెలిపారు. గతంలో శంషాబాద్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో కూడా పందుల దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈశ్వర్, గణేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

దేవుని విగ్రహాలు, పోస్టర్లు, పూజ సామగ్రిని బయట పడవేయవద్దు

● నగరంలోని తొమ్మిది ఆలయాల్లో వాటి సేకరణ

పంజాగుట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవుడి పాత విగ్రహాలు, పాత, చిరిగిపోయిన పుస్తకాలు, పూజా సామగ్రి, దేవుని చిత్రపటాలను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని ఆర్య వైశ్య కమ్యూనిటీ ఇంటర్నేషనల్ ట్రస్ట్ కార్యదర్శి తులసీ సరాఫ్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు కిరణ్, పి.స్వాతిలతో కలిసి ఆమె వివరాలు వెల్లడించారు. తాము వాటిని సేకరించి వివిధ పద్ధతుల్లో రీసైకిల్ చేసి తిరిగి వినియోగంలోకి తెస్తామని తెలిపారు. ఇందుకోసం నగరం, శివారు ప్రాంతాల్లోని తొమ్మిది ఆలయాల వద్ద వాటి సేకరణ కార్యక్రమాన్ని ఈనెల 11న ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. ఉప్పల్, కొత్తపేట, అంబర్‌పేట వెంకట్ రెడ్డినగర్‌లలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, కొత్తపేట గాయత్రీపురంలోని గణపతి దేవాలయం, ఉప్పల్ బీరప్పగడ్డలోని మహంకాళి ఆలయం, మలక్‌పేట దయానంద్‌నగర్‌లోని శ్రీ రామాలయం, మెట్టుగూడ అలుగడ్డబావిలోని హనుమాన్ ఆలయం, సాయిబాబా ఆలయం, చింతల్ ప్రసూననగర్‌లోని కోదండ రామాలయం, సనత్‌నగర్ శివాజీనగర్‌లోని సెవన్ టెంపుల్స్ వద్ద వీటిని సేకరించనున్నట్లు వారు వివరించారు.

రైల్వేస్టేషన్ల నుంచి శివార్లకు బస్సులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ నుంచి శివారు ప్రాంతాలకు బస్సులు పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు తీసుకుంటున్నది. కొత్తగా 83జె/272జీ రూట్‌లో కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి గండిమైసమ్మ వరకు శనివారం నుంచి 5 బస్సులను అందుబాటులోకి తెస్తునట్లు గ్రేటర్ ఆర్టీసీ జోన్ ఈడీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. రైల్వేస్టేషన్లలో దిగిన ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు ఆర్టీసీ బస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నాలుగు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సికింద్రాబాద్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు ప్రత్యేక రైళ్లను మరికొద్దిరోజుల పాటు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-రామనాథపురం స్పెషల్ (రైల్‌నంబర్: 07695)ను ఈనెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వరకు (ప్రతి బుధవారం) పొడిగిస్తున్నారు. రామనాథపురం-సికింద్రాబాద్ స్పెషల్ (రైల్‌నంబర్: 07696)ను ఈ నెల 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 27 వరకు (ప్రతి శుక్రవారం), నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు (రైల్‌నంబర్: 07153)ను ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 27 వరకు (ప్రతి శుక్రవారం), అలాగే ఎస్ఎంవీటీ బెంగళూరు-నర్సాపూర్ (రైల్‌నంబర్: 07154)ను ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 28 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

గ్రేటర్‌లో 345 డెంగీ కేసులు నమోదు

హైదరాబాద్‌సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వ్యాప్తంగా 345 డెంగీ కేసులు, ఒక మలేరియా కేసు నమోదయ్యాయి. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య, జీహెచ్ఎంసీ సంయుక్త పరిశీలన చేపట్టారు. 108 వార్డుల్లో 465 ప్రాంతాలను అధికారులు హాట్ స్పాట్‌లుగా గుర్తించారు. ఆగస్టు 15 వరకు వైద్యఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 175 వైద్యశిబిరాలు నిర్వహించగా.. 191 హాట్ స్పాట్‌లలో యాంటీలార్వా ఆపరేషన్స్, పైరత్రిన్ రసాయనాలు పిచికారి చేశారు. చెరువులు, మూసీ తీరంలోని 24 ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్స్ చేపట్టారు. డెంగీపాజిటివ్ కేసు నమోదైన ఇళ్ల చుట్టూ మొత్తం 6,151 ఇళ్లలో స్ప్రే చేశారు. 13,721 ఇళ్లలో 118 పాఠశాలలు, 12 కళాశాలలో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే చేశారు. 62 లోకేషన్లలో 365 ఆయిల్ బాల్స్ విడుదల చేయగా, 148 ఖాళీ స్థలాల్లో గంబుజియా చేపలు విడుదల చేశారు.

కాపర్ కరెంటు వైర్లు దొంగతనం చేసే ముగ్గురు నిందితులు అరెస్టు

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల వద్ద కరెంటు మీటర్ల కాపర్ వైర్లను అపహరించుకుపోయే ముగ్గురు నిందితులను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 16 కిలోల కరిగించిన కాపర్, రెండు పల్సర్ బైకులు, నాలుగు కటింగ్ మిషన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సలీం అన్వేష్(29), సలీం ప్రవీణ్ (31) ఇద్దరు అన్నదమ్ములు, కాటూరి ప్రవీణ్ (28) ముగ్గురు కుంట్లూరు శివశంకర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ముగ్గురు ముఠాగా ఏర్పడి కొంత కాలంగా కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల వద్ద కరెంటు పోల్ నుంచి మీటర్‌కు ఉండే కాపర్ వైర్లను దొంగలిస్తున్నారు. శివా రు ప్రాంతాలకు వెళ్లి కాపర్ వైర్లను కరిగించి విక్రయిస్తున్నారు. తద్వారా వచ్చిన సొమ్ముతో విలాసాలకు పాల్పడుతున్నారు. హయత్‌నగర్ పోలీసులు నిందితులను శుక్రవారం కుంట్లూర్ రోడ్డులో పట్టుకుని రిమాండుకు తరలించారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాకాలనీలో ఉండే రమావత్ గీత కుమారుడు రమావత్ అనీల్(24)కు మతిస్థిమితం లేదు. రోజు ఇంటికి సమీపంలో తిరిగి ఇంటికి చేరుకుంటాడు. గత నెల 27వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిన అనీల్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లి గీత తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు..

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కూతురు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్ అయ్యప్పకాలనీలో నివాసం ఉండే షర్పల్లి నర్సింహ(80) బుధవారం హయత్‌నగర్ పాత రోడ్డులో ఉండే కూతురు ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంత వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టిన కారు

● దంపతులకు స్వల్ప గాయాలు

హయత్‌నగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని గుంతలో పల్టీకొట్టిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారి పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డిపాలెం వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని దంపతులు గురువారం రాత్రి హయత్‌నగర్ వైపు నుంచి నల్లగొండ వైపుకు కారులో వెళ్తుండగా ప్రమాద వశాత్తు డివైడర్‌ను ఢీకొని లక్ష్మారెడ్డి పాలెం వద్ద జాతీయ రహదారిపైన వంతెన కోసం తీస్తున్న గుంతలో పడింది. దీంతో కారులో ఉన్న దంపతులకు గాయాలు కాగా నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులోని బెలున్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. కారులోని మహిళకు తల, చేతికి గాయాలు అయినట్లు తెలుస్తుంది. కారులో ఉన్నది ఎవరనేది తెలియదు. గాయాలకు గురి అయిన వారు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. శుక్రవారం ఉదయం గుంతలో పడిన కారును క్రేన్ సహాయంతో వెలికి తీశారు.